
# ఓ నిజాయితీ కథ



కొటిప్పూరి త్రిమూర్తి సత్యనారాయణ

"ఇదిగో! రిక్షా!..." చేతిలోవున్న కేష్ బేగ్‌ని ఆ చేతినుంచి ఈ చేతికి మార్చుకుంటూ పిలిచాడు కామేశ్వరరావు.

రిక్షాతో సహా దగ్గరకొచ్చి నిలబడ్డాడు రవి.

"భీమవరం బస్టాండుకి వస్తావా?" అడిగాడు కామేశ్వరరావు.

"వస్తాను సార్!"

"ఏం ఇమ్మంటావ్?"

"డబ్బులండి!"

"ఓర్నీ సిగతరగ- భలేవాడివిలాగున్నావే..." అంటూ రిక్షావాడన్న మాటకి నవ్వి-

"డబ్బులే ఇస్తాగాని- ఎన్ని డబ్బులిమ్మంటావ్?..." అని అడిగాడు కామేశ్వరరావు.

"మూడు రూపాయలు!"

"ఏందీ?... మూడు రూపాయలా?!"

"ఆయ్!"

"మరీ అంత ఆశ పనికిరాదు- రూపాయిన్నర ఇస్తాము!"

"మూడు రూపాయలకి తక్కువ రాను!"

"పది గజాల దూరానికి మూడు రూపాయ లెందుకయ్యా?"

"పది గజాల దూరానికి రిక్షా ఎందుకండి?... నడిచెళ్ళిపోండి!..."

"ఓర్నీ- గట్టివాడివే?... నీతో బేరాలాడుకుంటూ వుంటే- బస్సు వెళ్ళిపోతుంది!... సరే, పోనీయ్ ..." రిక్షా ఎక్కాడు కామేశ్వరరావు.

రిక్షా కదిలింది!

"నువ్వు చదువుతున్న వాడిలా వున్నావ్?... రిక్షా తొక్కుతున్నావేమిటి?..." అడిగాడు కామేశ్వరరావు.

"చచ్చిపోయేవరకూ బ్రతకటానికి!" చెప్పాడు రవి.

"ఉద్యోగ ప్రయత్నాలేమీ చేయలేదా?"

"చేసి, చేసి- అవి డబ్బు, పలుకుబడీ వున్నవాళ్ళకి తప్ప- మాలాంటివాళ్ళకి రావు అన్న సత్యాన్ని గ్రహించి విరమించుకున్నాను..."

"మీ అమ్మా, నాన్న ఏం చేస్తుంటారు?"

"తమ ఒంట్లో శక్తి వున్నంతవరకూ నన్ను చదివించారు- ఇప్పుడు శక్తి సన్నగిల్లి రోగంతో మంచంపట్టారు-"

"నువ్వే నయం!... కన్న తల్లిదండ్రులకోసం-ఉద్యోగం రాకపోయినా రిక్షా తొక్కుతున్నావ్!... నీ వయసువాడే నాకూ ఓ కొడుకున్నాడు!...చదువుకోమని కాలేజీకి పంపిస్తే, చెడుస్నేహాలు చేసి పాడైపోయాడు.... బలాదూర్‌గా తిరుగుతాడే గాని- ఇంటి విషయాలు అసలు పట్టించుకోడు!...

"నేను ఎలిమెంటరీ స్కూలు మాష్టారుగా పనిచేసి రిటైరయ్యాను... నాకు ఓ కొడుకు, ఓ కూతురు... కొడుకు పనికిరాకుండా తయారయ్యాడు... కూతుర్ని ఓ అయ్య చేతిలో పెట్టడానికి నానా తంటాలు పడుతున్నాను. సంబంధం కుదిరింది... పెళ్ళి వారంరోజుల్లో వుంది- పెళ్ళికి డబ్బులేక- ఈ ఊళ్ళో వున్న స్వంత ఇల్లు అమ్మి డబ్బు తీసుకెళ్తున్నాను..." అని—

"త్వరగా పోనియ్!... ఇంకొక అయిదు నిముషాల్లో బస్సుంది... ఈ బస్సు దాటితే మళ్ళీ మూడు గంటలవరకు బస్సులేదు!..." అంటూ రవిని తొందర పెట్టాడు కామేశ్వరరావు.

రిక్షా వేగం పెంచాడు రవి.

కొద్దిసేపటికి రిక్షా బస్టాప్‌కి చేరుకుంది.

అప్పటికే భీమవరం వెళ్ళే బస్ స్టాప్‌లో ఆగి వుంది!

కామేశ్వరరావు గబగబా రిక్షా దిగి, చొక్కాజేబులో వున్న డబ్బులు రవికిచ్చి, పరుగుపరుగున వెళ్ళి కదలబోతున్న బస్ ఎక్కాడు.

కామేశ్వరరావు ఇచ్చిన డబ్బులు జేబులో పెట్టుకొని, రిక్షా వెనక్కి తిప్పుతూండగా- రిక్షా సీటులోవున్న కేష్‌బేగ్ కనిపించిందతనికి!

'అరె! బేగ్ మర్చిపోయాడాయన!' అనుకుంటూ బస్‌కోసం చూశాడు రవి.

అప్పటికే బస్ వెళ్ళిపోయింది!

ఇప్పుడెలా?... ఈ డబ్బు లేకపోతే వాళ్ళమ్మాయి పెళ్ళి ఆగిపోతుందేమో?— వచ్చే బస్‌లో 'భీమవరం' వెళ్తే?... 'భీమవరం'లో ఎక్కడుంటాడు ?... అసలు ఆయనది 'భీమవర'మేనా?... 'భీమవరం'లో దిగి, వేరే బస్ ఎక్కి

ఇంకో ఊరేదయినా వెళ్తాడా?- ఏమో?- బేగ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్తే?... వాళ్ళ ఊరు వెళ్ళాకయినా ఈ బేగ్ సంగతి గుర్తుకొచ్చి, అక్కడినుంచి ఈ ఊరు పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసినా ఆయన తిరిగి మళ్ళీ ఈ ఊరు వచ్చినా, తన అడ్రస్ తెలియదు కాబట్టి పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి రిపోర్ట్ చేస్తాడు!... అప్పుడయినా ఈ బేగ్ ఆయనకి క్షేమంగా చేరుతుంది...!

ఇదే అన్నివిధాలా మంచిదనిపించింది రవికి- రిక్షాతో సహా పోలీస్‌స్టేషన్ చేరుకున్నాడు.

పరాసరి ఎస్.ఐ. దగ్గరకెళ్ళి—

"నమస్కారం సార్!" విష్ చేశాడు రవి.

ఫైల్లోంచి తలెత్తి చూశాడు ఎస్.ఐ.

"నా రిక్షాలో ఒకాయన ప్రయాణం చేస్తూ- బస్ వచ్చిన కంగారులో, ఈ బేగ్ మర్చిపోయి బస్ ఎక్కేశాడు!..." చెప్పాడు రవి.

"అతనిది ఏ ఊరు?" అడిగాడు ఎస్.ఐ.

"తెలియదు సార్!... ఆయన 'భీమవరం' వెళ్ళే బస్ ఎక్కాడు!..."

"ఈ బేగ్‌లో ఏం వుంది?"

"నేను చూడలేదు సార్!"

రవి దగ్గరున్న బేగ్ తీసుకొని, బేగ్ జిప్ తీసి చూసి-

"మైగాడ్!... మనీ!..." ఆశ్చర్యపోయాడు ఎస్.ఐ.

పదులు, ఇరవైలు, ఏభైలు, వంద రూపాయల నోట్ల కట్టలతో నిండివుందా బేగ్.

"ఒకర్నొకరు దోచుకుంటున్న ఈ రోజుల్లో- నువ్వు ఇంత డబ్బును తీసుకొచ్చినందుకు నీ నిజాయితీని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను!..." రవి చేతిని తన చేతిలోకి తీసుకొని కరచాలనం చేసి-

"నిన్ను చూస్తుంటే నాకు చాలా ఆనందంగా వుంది!... దేశం నిండా నీలాంటివాళ్ళే వుంటే మా డిపార్ట్‌మెంట్‌ని మూసేయొచ్చు!... నీ అడ్రస్ ఇచ్చి వెళ్ళు- అవసరమైతే పిలుస్తాను!" అన్నాడు ఎస్ ఐ.

వైట్ పేపర్ మీద తన అడ్రస్ రాసిచ్చాడు రవి.

"వెళ్ళొస్తాను సార్!"

"అలాగే!"

రవి పోలీస్‌స్టేషన్ నుంచి బయట పడ్డాడు.

* * *

మర్నాడు—

గాంధీసెంటర్‌లో వున్న రిక్షా స్టాండులో నిలబడి 'బాడుగ' కోసం ఎదురుచూస్తున్న రవి దగ్గరకి ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చారు.

"నిన్ను మా అయ్యగారు రమ్మంటున్నారు!" అన్నారు కానిస్టేబుల్స్.

"మా అయ్యగారా?!" ఔత్తరపోయాడు రవి.

“అవును। మా ఎస్.ఐ.గారు నిన్ను అర్జెంటుగా తీసుకురమ్మన్నారు.”

“ఎందుకు?”

“తెలియదు।”

“నిన్న నేను డబ్బుతో వున్న బేగ్ దొరికితే మీ స్టేషన్‌లో అప్పజెప్పాను-దాని తాలూకు మనిషి ఎవరైనా వచ్చారా?...”

“ఎవరో-ఓ ముసలాయన వచ్చారు.”

డబ్బుగలాయనే వచ్చివుంటాడు।... డబ్బు పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పి, ఆయన డబ్బు ఆయనకి క్షేమంగా చేరేలా చేసినందుకు కృతజ్ఞతలు చెప్పుకోవటానికి తనకోసం కబురు పంపించి వుంటాడు।— డబ్బు తిరిగి దొరికినందుకు ఆ ముసలాయన ఏమైనా 'బహుమతిగా ఇస్తే తీసుకోకూడదు।—' అనుకుంటూ పోలీస్‌స్టేషన్ గుమ్మందాటి లోపలకు వచ్చిన రవి షర్టుకాలర్ పట్టుకొని, చెంప ఛెళ్ మనిపించాడు ఎస్.ఐ.

ఈ హఠాత్ పరిణామానికి విస్తుపోయాడు రవి.

“దొరికిన డబ్బు తీసుకొస్తే పెద్ద నిజాయితీపరుడవని నమ్మాను।— నీలాంటి మోసగాడ్ని నా సర్వీసులో చూడలేదు।— చెప్పరా।— డబ్బెక్కడ దాచావ్?— చెప్పు।” అంటూ రవిని గొడ్డును బాదినట్టు బాదుతున్నాడు ఎస్.ఐ

“నా రిక్షాలో ఆయన బేగ్ మర్చిపోతే అది తీసుకొచ్చి మీకు అప్పజెప్పాను.. అంతే।— అంతకుమించి నా కేమీ తెలియదు।— నన్ను కొట్టకండి।—” లాఠీ దెబ్బలు భరించలేక ఏడుస్తూ ప్రాధేయపడుతున్నాడు రవి.

“ఈ బేగ్‌లో మీ డబ్బు ఎంత వుండాలి?” అడిగాడు ఎస్.ఐ కామేశ్వరరావుని.

“ముప్పైవేలు— నా కూతురి పెళ్ళికోసం ఈ ఊళ్లో వున్న నా స్వంత ఇల్లు అమ్మాను— ఇల్లు కొన్న ఆసామి కూడా ఇక్కడే వున్నాడు, అడగండి।”

“నేను ఇల్లు ముప్పైవేలకి కొన్నాను. దాని తాలూకు కాగితాలు ఇవిగో।—” అంటూ కాగితాలు చూపించాడు పట్టాభి రామారావు.

“మీరు కరెక్టుగా 'కేష్' ఇచ్చేశారా?” కాగితాలు చూస్తూ అడిగాడు ఎస్.ఐ.

“ఇచ్చేశాను।” చెప్పాడు పట్టాభి రామారావు.

“నేను ఒకటికి మూడుసార్లు కేష్‌ని చూసుకున్నాను. ఏమీ తేడా రాలేదు।—” అన్నాడు కామేశ్వరరావు.


“ఇప్పుడు పాతికవేలే వున్నాయంటున్నారు.”

“మిగిలిన అయిదువేలు వీడే కాజేసుంటాడు। తనమీద అనుమానం రాకుండా వుండేందుకు ఈ డబ్బు తీసుకువచ్చి మీకు అప్పజెప్పి, తెలివిగా తప్పించుకోబోయాడు।—” చెప్పాడు కామేశ్వరరావు.

“చెప్పరా।— ఆ అయిదువేలు ఏం చేశావ్?” మళ్ళీ లాఠీతో కొట్టడం ప్రారంభించాడు ఎస్.ఐ.

“నిజం సార్।—నాకేం తెలియదు।” ఆ దెబ్బలు భరించలేక ఏడుస్తున్నాడు రవి.

లాఠీతో రవిని చేతులు నొప్పిపెట్టేవరకు కొడుతూనే వున్నాడు ఎస్.ఐ.




రవి స్పృహతప్పి పడిపోయాడు.

కానిస్టేబుల్ని పిలిచి రవి ముఖాన కాసిన్ని నీళ్ళు కొట్టించాడు ఎస్.ఐ.

కాసేపటికి కళ్ళు తెరిచాడు రవి.

రవిని లాకప్‌లో పెట్టించాడు ఎస్.ఐ.

* * *

సరిగా ఈ సంఘటన జరిగిన మరుసటి రోజు-

ఎస్.ఐ. ఇంట్లోకి 'అయిదు వేలు' విలువచేసే కలర్ టి.వి. వచ్చింది.

ఎస్.ఐ. ఇంట్లోవాళ్ళంతా కలర్ టి.వి ఎంతో ఉత్సాహంగా చూస్తున్న అదే వేళకి—

కామేశ్వరరావు ఆలోచిస్తున్నాడు- కట్నం డబ్బుల్లో 'అయిదు వేలు' లోటుని ఎలా పూడ్చాలా అని;

ఏ ఆలోచనా రాక మొద్దుబారిపోయిన మెదడుతో కూర్చున్నాడు రవి. దొంగగా ముద్ర వేయించుకున్నందుకు 'ఓబులేశు' రిక్షా అద్దెకివ్వనన్నాడు.— లాకప్‌లో వున్నందుకు ఈ రోజు బాడుగలేదు. తిండిలేదు. రేపెలా?

**